పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో 2023 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు శ్రీకాకుళం జిల్లా గార మండలం దీపావళి గ్రామానికి చెందిన ఉప్పెనవలస ఉమా మహేశ్వరరావు (20)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. విజయనగరంలో నివాసం ఉంటున్న 14ఏళ్ల బాలికతో ఉమా మహేశ్వరరావు (20)కు ఇన్స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి నిందితుడు ఫోన్లో మాట్లాడుతూ ప్రేమిస్తున్నానని నమ్మించి, మోసం చేసి, శ్రీకాకుళం తీసుకొని వెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లిదండ్రులు టూటౌన్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 20ఏళ్ల జైలు, రూ.2500 జరిమానాతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారంగా ఇప్పించాలని తీర్పును వెల్లడించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..

పలుచోట్ల కార్మికసంఘాల నిరసనలు
జూలై 9న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘాల పిలుపులో భాగంగా లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని,8 గంటలు పని దినం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె .సురేష్, ఎఐఎఫ్ఎ,ఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు బెహరా శంకర్రావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు లక్ష్మి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ దోపిడీదార్లకు కొమ్ము కాసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాస్తూ కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మిక వర్గంతో పాటు రైతులను నట్టేట నుంచి రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. పోరాడి ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జూలై 9 న జరిగే జాతీయ స్థాయి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, నగర కార్యదర్శి బి రమణ, ఉపాధ్యక్షులు ఆర్ శంకర్రావు, నాయకులు సుధీర్, శ్రీను, ఎఐఎఫ్‌టియు నాయకులు అప్పలరాజు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బి. గీత, జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ళ అప్పల సూరి తదితరులు పాల్గొన్నారు.

మోడీ బుద్ధి మార్చాలని గాంధీ విగ్రహానికి వినతి

గజపతినగరం : నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే విధంగా మోడీ బుద్ధి మార్చాలని గాంధీ విగ్రహానికి సిఐటియు ఆధ్వర్యాన వినతినిచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రాష్ట్ర కార్యదర్శి బి.కాంతారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 42 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు పోయి కట్టుబానిసలుగా మారే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో జులై 9న జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దత్తిరాజేరులో కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, పంచాయతీ కార్మికులు నాయకులు బి.కనకరాజు, ఎస్.కృష్ణ, గోవింద, కోటి, మహంకాళి శ్రీను పాల్గొన్నారు.

కొత్తవలస : కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తవలస అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలని, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, ఆటో యూనియన్ నాయకుడు బెహరా సూర్యనారాయణ, అంగన్వాడి నాయకురాలు కాకర తులసి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక వర్గం సంఘటితంగా తిప్పికొట్టాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవింద, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతుల జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు గండ్రేటి అప్పలనాయుడు, డప్పు కళాకారుల సంఘవం నాయకులు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మోడీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ బిజెపి తీసుకొచ్చిన లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వి.కన్నబాబు, వి.చిన్న, బి.కనక మహేశ్వరరావు, పి.నాగరాజు, ఎ.అప్పారావు, బి.అప్పారావు, వై స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు గొల్లదేవి, మండల అధ్యక్షులు టి.రమణ, పాల్గొన్నారు.

భోగాపురం : కార్మిక చట్టాల స్థానంలో బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా భోగాపురం గ్రామంలోని ముక్కాబ్రిడ్జి సెంటర్, పూసపాటిరేగ బ్రిడ్జి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ నాయకులు ఆదిలక్ష్మి, సూర్యకుమారి, కొల్లి శ్రీను, బోనిఅప్పారావు, చందల అప్పారావు కొల్లిప్పారావు, కోరాడ రాము తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

గజపతినగరంలో గాంధీ విగ్రహానికి వినతిస్తున్న సిఐటియు నాయకులు;

కొత్తవలస అంబేద్కర్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు, నాయకులు;

పూసపాటిరేగలో నిరసన తెలుపుతున్న కార్మికులు

వీధుల్లో తిరుగుతున్న సిరిమాను

ఆకట్టుకున్న వేషధారణలు

అంజలి రథం

ఘనంగా శ్యామలాంబ పండగ

- పోటెత్తిన జనం
- ఆకట్టుకున్న తప్పెటగుళ్ళు, పులి వేషాలు
- అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో శ్యామలాంబ పండగ ఘనంగా జరిగింది. పండగలో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జన్నివాడ ధనుంజయరావు సిరిమాను రథంపై ఆశీనుడైన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రథాన్ని తాడు లాగి ప్రారంభించారు. అల్లువీధి నుంచి ప్రారంభమైన సిరిమాను ఉత్సవం శివాజీ జంక్షన్, బోసు బొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డు, వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్, కోటవీధి, పెదకోమటి పేట, డబ్బివీధి మీదుగా ఆలయం వద్దకు చేరింది. ఈ ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పులి వేషాలు, తప్పెటగుళ్ల ఆకట్టుకున్నాయి. సిరిమానోత్సవాన్ని చూడ్డానికి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. డిఎస్‌పి రాంబాబు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్

శ్యామలాంబ పండుగ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సతీసమేతంగా వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆలయం వద్ద ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని వారు చెప్పగా, వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చక్రం ఇరుసు విరిగిపోవడంతో ఆగిన సిరిమాను

సిరిమానోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. అక్కేన వీధి రామమందిరం నుంచి ప్రారంభమైన సిరిమాను బోసుబొమ్మ జంక్షన్‌కు చేరడానికి ముందే ఆగిపోయింది. సాలూరు రూరల్ సిఐ కార్యాలయం ఎదురుగా అంజలి రథం చక్రం విరిగిపోవడంతో సిరిమాను రథాన్ని అక్కడే నిలిపివేశారు. కొత్త చక్రం తెప్పించి అమర్చిన తర్వాత సిరిమానోత్సవం తిరిగి ప్రారంభించారు. ముహూర్తం ప్రకారం సిరిమానోత్సవం సాయంత్రం 4.05 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే గంటన్నర ఆలస్యంగా ప్రారంభం కావడంతో చీకటి ఆవహించింది. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో కాకుండా పట్టణమంతా విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

గత ఐదేళ్లలో గాడి తప్పిన పాలన

మినీ మహానాడులో పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

గత ఐదేళ్ల వైసిపి అరాచక పాలన వల్లే సమాజం గాడి తప్పిందని టిడిపి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు విమర్శించారు. మంగళవారం విజయనగరం నియోజకవర్గ మహానాడు కార్యక్రమం మెసానిక్ టెంపుల్ నందు ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ ల చిత్రపటాలకు నాయకులు అందరూ నివాళులు అర్పించారు. అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ జగన్ అరాచక పాలన వలన మాదక ద్రవ్యాలు రిటైల్ మార్కెట్ గా మారిందని, దీంతో విజయనగరం వంటి ప్రశాంతమైన ప్రాంతం కూడా ఉగ్రవాద లింకులకు ఆస్కారం కలిగిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, ప్రసాదుల కనకమహాలక్ష్మి , అనురాధ బేగం, పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నరసింగ రావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు, విజయనగరం ఎఎంసి కర్రోతు వెంకట నర్సింగరావు, పొగిరి పైడిరాజు, ఎస్ఎంకె భాషా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమావేశంలో తీర్మానాలు చేసి రాష్ట్ర పార్టీకి పంపించారు.

మహానాడులో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

కస్టడీ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఉగ్రవాద సానుభూతిపారులు సిరాజ్, సమీర్‌ను కస్టడీకి అప్పగించాలని జిల్లాకోర్టులో పోలీసులు వేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. విశాఖ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని వారం రోజులు పాటు కస్టడీకి అప్పగించాలని జిల్లా కోర్టును టూటౌన్ పోలీసులు ఆశ్రయించగా, మంగళవారం వాదనలు ముగిశాయి. అయితే తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం, బుధవారం తీర్పును వెల్లడించే అవకాశం ఉంది.

ఫైడే సినిమాను ఆదరించండి

అమ్మలోని అమృతత్వాన్ని ఆవిష్కరించే చిత్రం : కథానాయిక దియారాజ్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

అమ్మలోని అమతత్వాన్ని ఆవిష్కరించి న అద్భుత చిత్రం 'ఫైడే'అని ఆ సినిమా కథానాయిక దియారాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని జిఎస్ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు చెందిన తనను తెలుగు చిత్రసీమ ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతిభవున్న వారు ఎందరో ఉన్నారన్నారని, కానీ అందరికీ అవకాశాలు రావడం లేదన్నారు. నిర్మాత కేశనకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేక్షకులకు సందేశాన్ని కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలనే సంకల్పంతో అమ్మలోని అమృతత్వాన్ని ఆవిష్కరిస్తూ 'ఫైడే' చిత్రాన్ని నిర్మించామన్నారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి ప్రోత్సహించాలని కోరారు. దర్శకుడు ఈశ్వర్ ధూళిపూడి మాట్లాడుతూ ఫైడేచిత్రం అమ్మ సెంటిమెంటుతో ముడిపడి వుందన్నారు. ప్రతిబిడ్డ తల్లిగర్భంలో వున్నపుడే మనకు తెలియకుండా ఎన్నో విషయాలు నేర్చుకుంటాడని,. అలా సుభద్ర గర్భంలో ఉన్నపుడే అభిమన్యుడు పద్మవ్యూహం గురించి తెలుసుకుని వీరుడయ్యాడని అన్నారు. ప్రతి తల్లి గర్భవతిగా వున్నపుడు మంచి వాతావరణంలో మసలాలన్నారు. తాను సంచరించే పరిసరాలు, అక్కడ వుండే వ్యక్తుల ప్రభావం పుట్టబోయే బిడ్డపై ఎక్కువగా వుంటుందన్న 'రీజన్'తో కథా నేపథ్యం సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొనసాగుతుందన్నారు. వైవిధ్యంతో రూపొందించిన ఈ చిత్రానికి రాజ్మరియన్ కథ, మాటలు, స్క్రీన్ప్లే సమకూర్చారన్నారు.ప్రజ్వల్ క్రిష్ సంగీతాన్ని సమకూర్చగా మధుకిరణ్ పాటలు రాసారన్నారు. ప్రధానపాత్రలో అమ్మగా నటించిన హీరోయిన్ దియారాజ్ ప్రేక్షకుల మనసులను ఆకట్టుకునేలా నటించారన్నారు. కుటుంబ సమేతంగా చూసి చిత్ర నిర్మాణ యూనిట్‌ను ఆశీర్వదించి ప్రోత్సహించాలని కోరారు. జనసేన నాయకుడు గురాన అయ్యలు మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన అమ్మాయిగా అందరూ ఆదరించాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు విజినిగిరి శ్రీనివాసరావు అదాడ మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కథానాయిక దియారాజ్

నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

హౌసింగ్ అధికారులతో సమావేశంలో కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయించి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారులకు అదనంగా 50 వేల రూపాయలను ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేయించేందుకు లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఇకపై ఇళ్ళ నిర్మాణాల విషయంలో ప్రతిరోజు సమావేశాలు నిర్వహించి పనులు పూర్తయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. నగరంలో వివిధ నిర్మాణ దశలో ఉన్న ఇళ్ళను పూర్తిచేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డిఇ జివి రంగారావు, ఎఇకె.రామకృష్ణ పాల్గొన్నారు.

డిబిఎస్‌యు చిట్టిబాబుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వారు భారతరత్న సుబ్రహ్మణ్యం పేరు మీద జాతీయస్థాయిలో పేదల అభ్యున్నతికి కృషి చేసేవారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. జాతీయ స్థాయిలో ఇచ్చే ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ అవార్డుకు దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు ఎంపికయ్యారు. భారతదేశంలో 2024-25వ సంవత్సరానికి గాను 14 మందిని ఎంపిక చేయగా అందులో పెంకి చిట్టిబాబును దళిత ఆదివాసీల బహుజనుల జీవితాలను మార్చేందుకు గత 20ఏళ్లగా పనిచేస్తున్న సేవలకు గాను అందులో చోటు దక్కింది. దళిత ఆదివాసి మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమంలో చేసిన కషిని గుర్తించి అవార్డు తో పాటు ఒక లక్ష రూపాయలు కూడా అందజేయనున్నారు. ఈ అవార్డును మే 22 వ తేదీన ఇండియన్ హాబిటేట్ సెంటర్, న్యూ ఢిల్లీ లో అందుకోనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం పట్ల చిట్టి బాబు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. దళిత ఆదివాసీల బతుకుల్లో మార్పు తెచ్చేందుకు మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబడిన విజయనగరం జిల్లా నుండి చిట్టిబాబు ఎంపికావడం హర్షణీయమని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కె శిరీష, కోశాధికారి పి.శేషారత్నం, సంయుక్త కార్యదర్శి కె సి హెచ్ బంగారు రాజు, వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, దళిత మానవ హక్కుల ఉద్యమ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

'సీతం'లో రక్తదాన శిబిరం

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కల్నల్ గోపేంద్ర, సుబేధర్ మేజర్, బి ఎస్ బొడలే, క్యాడెట్లు రక్తదానం చేశారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ అనేది నిజమైన సేవ, సామాజిక బాధ్యత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. సీతం ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యూనిట్లు, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ , స్వాష్ సేవా సంఘం సభ్యుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామమూర్తి, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాయిదేవమణి తదితరులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్‌జయంతి

విజయనగరం టౌన్ : ఈ నెల 22 గురువారం వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్‌జయంతి కార్యక్రమం నిర్వహిస్తామని ప్రాజెక్ట్ చైర్మన్ మడిపల్లి వెంకటచలం తెలిపారు. మంగళవారం దేవాలయం ఆవరణలో జరిగిన విలేఖర్ల సమావేశంలో చలం మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 4 గంటల నుండి స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నరు. ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎస్.గుప్త మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు చిన్నారులతో సింధూరార్చన, 27రకాల పిండివంటల సమర్పణ ఉంటుందని అన్నారు దేవాలయం కన్వీనర్ పెంటపాటి కామరాజు మాట్లాడుతూ భక్తులకోసం మంచినీరు, చల్లని మజ్జిగ, మధ్యాహ్నం 7వేల మందికి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జయంతి కరపత్రంలు విడుదల చేశారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయాల ద్వారా మెరుగైన పౌర సేవలు అందాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం నగరంలోని 35వ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి సచివాలయ కార్యదర్శులు విధులకు హాజరై ప్రజలకు సేవలను అందించాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతం పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

ప్రభుత్వ అసంబద్ధ విధానాలపై పోరు

నేడు డిఇఒ కార్యాలయం ముట్టడి
ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన అసంబద్ధ విధానాలపై ఉపాధ్యాయ సంఘాలన్నీ ఉమ్మడిగా పోరు సాగించేందుకు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ విద్యా రంగానికే పెను ప్రమాదం తీసుకొచ్చే విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తుండడంతో ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు పోరుబాట పట్టాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం 19, 20, 21 ఉత్తర్వులను విడుదల చేయడంతో, ఇవి కొత్త ప్రయోగాలుగా, అసంబద్ధంగా ఉన్నాయని, వీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈమేరకు ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాలకు జరిగిన చర్చలు విఫలమవ్వడంతో ఉపాధ్యాయులంతా పోరుబాటలోకి దిగారు. అందులో భాగంగా ఈనెల 21న జిల్లా కేంద్రంలో డిఇఒ కార్యాలయాలు, 23న అమరావతిలోని విద్యాభవన్ ముట్టడి కార్యక్రమాలకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయ ముట్టడిలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు జిఒ117 పూర్తిగా రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక బడులను విచ్ఛిన్నం చేసి 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను తీసుకొస్తే ప్రస్తుత ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ప్రవేశ పెట్టడం సరైన విధానం కాదని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన హేతుబద్ధీకరణ, పునర్విభజన జిఒలు 19, 20, 21 లలో అసంబద్ధ విధానాలు ఉన్నాయని మండి పడుతున్నారు. ప్రధానంగా తెలుగు మీడియం, మైనర్ మీడియంను పూర్తిగా విస్మరించడం, సబ్జెక్ట్ టీచర్లను ప్రాథమిక పాఠశాలలకు పంపించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. కొత్త ఉన్నత పాఠశాలలకు హెడ్మాస్టర్, వ్యాయమ ఉపాధ్యాయులను కేటాయించకపోవడం, ఫౌండేషన్ స్కూళ్లలో 1:30 రేషియో అమలు చేయడం తదితర అసంబద్ధ విధానాలతో గందరగోళం నెలకొంటుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ఈ విధానాలను ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న జిల్లా కేంద్రం, 23న రాష్ట్ర కేంద్రంలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించాయి.


అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఇళ్ల స్థలాలు అప్పగించండి

తహశీల్దార్‌కు వినతినిచ్చిన తమ్మినేని

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలో ఇల్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు అప్పగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం భూ నిర్వాసిత బాధితులతో కలిసి స్థానిక తహశీల్దార్ నీలకంఠ రావుకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 168, 173లో 2018 టిడిపి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వారికి గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థలం అప్పగించక పోవడం వల్ల పేదలందరూ నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను పరిగణలోకి తీసుకొని, మూడు సెంట్లు స్థలం వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న తమ్మినేని తదితరులు

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని మంగళవారం పాకివీధి, నాగాసపువీధి, బలిజిపేట రోడ్డు, కోరాడవీధి ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. కాలువలలో పూడికలు ఉండడంతో తొలగించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీని ఆదేశించారు. ఆమెతో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి, ఎన్‌కెఆర్‌పురం గ్రామాల్లో గ్రామ దేవతలు పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కోలాటాలు, పులి వేషాలు, కాళికాదేవి వేషాలు, మహిళలు అమ్మవారి వేషాలతో నృత్య ప్రదర్శనలు చేశారు. డప్పు వాయిద్యాలు, భారీ మందుగుండు సామగ్రితో ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పండగ నేపథ్యంలో గ్రామలు బంధువులతో కిటకిటలాడాయి. పార్టీలకు అతీతంగా గ్రామ కమీటీల ఆధ్వర్యంలో పండగను వైభవంగా నిర్వహించారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నందమూరి అభిమాన సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ చేతులు మీదుగా పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. సామాజిక కార్యక్రమాలలో అభిమానులు ముందుండాలని శరత్ కోరారు. కార్యక్రమంలో నందమూరి అభిమాన సంఘం నాయకులు శ్రీనివాస్, మాధవ్, ఉమా పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్లకు బెల్టులు ప్రదానం

ప్రజాశక్తి - కొత్తవలస

ఇటీవల జరిగిన జిల్లా కరాటే పోటీల్లో సత్తా చాటిన కొత్తవలస విద్యార్థులకు మంగళవారం బెల్టులు ప్రదానం చేశారు. ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న పి. చైతన్య కార్తికేయ కాటాలో గోల్డ్ మెడల్, కుమేటిలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఎల్.సాయి చరణ్ కాటాలో బ్రాంజ్, కుమేటిలో సిల్వర్, కె.ముకేష్ కాటాలో సిల్వర్, కుమేటిలో బ్రాంజ్, పి.వేదశ్రీ కాటాలో గోల్డ్, కుమేటిలో సిల్వర్, ఎల్.అవినాష్ కాటాలో సిల్వర్, కుమేటిలో బ్రాంజ్, ఏ.యోగి కాటాలో బ్రాంజ్, కుమేటిలో సిల్వర్, వి.గణరాజ్ కాటాలో సిల్వర్, కుమేటిలో బ్రాంజ్, వి.మోక్షజ్ఞ కాటా, కుమేటి బ్రాంజ్ మెడల్, ఈ. దేవకి లత కాటాలో గోల్డ్, కుమేటిలో బ్రాంజ్, ఈ. శ్రీలక్ష్మి ప్రసన్న కాటా అండ్ కుమేటి సిల్వర్, కె.లక్ష్మి దీపక్ కాటా, కుమేటీలో గోల్డ్ మెడల్ సాధించారు. క్రీడాకారులందరినీ కోచ్ కర్రి సూర్య నూకరాజు అభినందించి బెల్టులు అందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ రామ్మోహనరావు హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం పిసి అండ్ పిఎన్‌డిటి సమావేశం నిర్వహించారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపడం నేరమన్నారు. బాలికల లింగ నిష్పత్తి పెంచేందుకు పని చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు నమోదు చేసి ఆయా స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజాంలో మినీ మహానాడు

ప్రజాశక్తి- రాజాం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టిడిపి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళిమోహన్ అన్నారు. పట్టణంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల శివారు గ్రామాలకి సాగునీరు అందిస్తామన్నారు. రంగాప్పు చెరువును సుందరమైన పార్కుగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ సిస్టం నిర్మిస్తామన్నారు. రామరాయపురం వద్ద బ్రిడ్జిని నిర్మిస్తామని, ప్రతి మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామాల్లో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేస్తామని మినీ మహానాడులో తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మనకు మంచి రోజులు వస్తున్నాయి

◆మినీ మహానాడులో టిడిపి శ్రేణులను ఉత్సాహపర్చిన కర్రోతు ◆ నెల్లిమర్ల నాయకులు గైర్హాజరుతో చర్చ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపి శ్రేణులంతా అసహనంతో ఉన్నారన్న సంగతి అందరికి తెలిసిందేనని సంయమనం పాటిస్తే మనకు మంచి రోజులు వస్తున్నాయని నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జగన్నాథరాజు ఫంక్షన్ హాల్‌లో నెల్లిమర్ల నియోజకవర్గం మిని మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు పార్టీ ఆవిర్భావం, ప్రస్తుత స్థితి గురించి చెప్పారు. కొంత మంది నాయకులు నియోజకవర్గంలో పరిస్థితులపై అసహనం వ్యక్తం చేశారు. దానికి బంగారాజు స్పందించి చెయ్యి కాలగానే కుండవదిలేస్తే నష్టపోతామన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ అందరికి తెలిసినవే అన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం అన్న నందమూరి తారక రామారావు సంక్షేమ పథకాలు గురించి వివరించి మన ప్రాంతాలకు సంబందించి తీర్మాణాలు చేయాలన్నారు. రామతీర్థసాగర్ నిర్మాణం మనకు అవసరమని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మునాయుడు, నాయకులు కంది చంద్రశేఖర్, పతివాడ అప్పలనారాయణ, కర్రోతు సత్యనారాయణ, విక్రం జగన్నాదం, పసుపులేటి గోపి, బొంతు ఉమా, చిల్ల పద్మ, చీకటి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల మండల నాయకుల అలక

నెల్లిమర్ల: నెల్లిమర్ల మండల నాయకులు సువ్వాడ రవిశేఖర్, వనజాక్షితోపాటు కడగల ఆనంద్, గేదెల రాజారావు లాంటి నాయకులంతా మినీ మహానాడుకు హాజరుకాలేదు. టిడిపి తమను గుర్తించడం లేదని చెప్పినట్లు సమాచారం. కడగల ఆనంద్‌కు డిసిసిబి అధ్యక్షులుగా పదవి వస్తుందని ఆశించారు. కానీ ఆ పదవిని వేరొకరికి ఇవ్వడంతో నిరాశకు గురైనట్లు తెలుస్తుంది. గేదెల రాజారావుకు ఎఎంసి ఇవ్వాలని కోరినా దానికి నిరాకరించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. కాగా ఇటీవల నెల్లిమర్ల మండల కేంద్రంలో జరిగిన తిరంగ ర్యాలీకు కూడా వీరంతా దూరంగా ఉండటంతో చర్చనీయాంశమవుతోంది.

టిడిపి అంటేనే అభివృద్ధి

లక్కవరపుకోట: తెలుగుదేశం పార్టీ అంటేనే అభివృద్ధి అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శ్రీ బాలాజీ నివాస్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలే దేవుళ్ళుగా పనిచేస్తున్న ఏకైక రాజకీయ పార్టీ టిడిపి అని అన్నారు. టిడిపి అంటే అభివృద్ధి, సంక్షేమానికి పర్యాయపదమని పార్టీ నేతలు కార్యకర్తలు అదే స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. 11 నెలల్లో రూ.125 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోయే కాలంలో ప్రతి ఒక్క టిడిపి కార్యకర్తను కాపాడుకునే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఇందుకూరు సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, 5 మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు

పంట సంజీవినిపై అవగాహన

డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి- రేగిడి

ప్రతి గ్రామపంచాయతీలో పంట సంజీవిని (ఫారం ఫండ్) పై రైతులకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ శారదా దేవి ఆదేశించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో రైతులకు ఫారం పాండ్స్ (పంట సంజీవిని)పై అవగాహన కల్పించి ఫారం పాండ్స్ వేయించాలని సూచించారు. ఫారం పాండ్స్ వల్ల రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి పంచాయతీలో సోక్ పిట్స్, కంపోస్టు పిట్స్ లబ్దిదారుల గుర్తించి పనులు చేయించాలని వివరించారు. ఉపాధి పనుల వద్ద వేతనదారులకు సదుపాయాలు కల్పించాలన్నారు. కొలతలు ప్రకారం పని చేయించి పనికి తగిన వేతనం కల్పించి పనులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, శ్రీనివాసరావు, ఈసి మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శారదాదేవి

ఎఐ ద్వారా గుర్తింపు సులభతరం

ప్రజాశక్తి- డెంకాడ

సెన్సార్లు, ఎఐ ద్వారా మానవ కార్యకలాపాల గుర్తింపు చాలా సులభతరమని ఎన్‌ఐటి సిల్చార్ నిపుణుడు డాక్టర్ బాదల్ సోని అన్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సిఎస్‌ఇ, ఎఐ, ఎంఎల్ విభాగం ఎసిఎం స్టూడెంట్ చాప్టర్‌తో కలిసి 'సెన్సార్ డేటా, స్మార్ట్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి మానవ కార్యకలాపాల గుర్తింపు' అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. అధునాతన సెన్సార్ టెక్నాలజీలు, మెషిన్ లెర్నింగ్ విధానాల ద్వారా కార్యాచరణ గుర్తింపుపై దృష్టి సారించిన వ్యవస్థలలో తాజా ఆవిష్కరణలపై విలువైన ఆలోచనలను అందించడం ప్రాథమికంగా ఈ సెమినార్‌లో జరిగింది. అస్సాంలోని ఎన్‌ఐటి సిల్చార్‌లోని కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాదల్ సోని ఈ సెషన్‌కు రిసోర్స్ పర్సన్‌గా హాజరై ప్రసంగించారు. స్మార్ట్ లెర్నింగ్ అల్గారిథమ్‌లతో సెన్సార్ డేటాను సమగ్రపరచడం, పెరుగుతున్న ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. ఈ ఇంటర్ డిసిప్లినరీ రంగం ఆరోగ్య సంరక్షణ, స్మార్ట్ హోమ్‌లు, భద్రత, మానవ-కంప్యూటర్ పరస్పర చర్య, మానవ ప్రతిచర్యలపై ఎఐ నిజంగా తెలివైన వాతావరణాలను సృష్టించడానికి వీలు కల్పించడం వంటి కీలక రంగాలలో ఎలా విప్లవాత్మక మార్పులు తెస్తోందో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అకాడమిక్స్ డాక్టర్ వి.అంజి రెడ్డి, డీన్‌లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాదల్ సోని

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి రోటరీ క్లబ్, ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ సంయుక్తంగా రక్త నాళాలు ఉబ్బటం, రక్తహీనత సంబంధిత వ్యాధులపై నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ రోటరీ సభ్యులు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి రాజు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. దీనిలో వెరికోస్ వెయిన్ (రక్తనాళాలు వాపు, మూసుకొని పోవటం)ను నిర్ధారించడానికి చేసే 4వేల రూపాయల విలువైన వాస్క్యూలర్ డోప్లర్ పరీక్షను ఉచితంగా చేస్తామన్నారు. వేస్క్యూలర్ సర్జన్ డాక్టర్ మరడా గణేష్ కుమార్, జనరల్ మెడిసిన్ డాక్టర్ లక్ష్మీ మైథిలి పర్యవేక్షణలో వేరికోస్ వెయిన్, డయాబెటిక్ ఫూట్ అల్సర్, రక్తనాళాలు వ్యాధి చికిత్సలు, అవగాహన ఉచితంగా అందిస్తా రన్నారు. హాస్పిటల్ సిఇఒ, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్ మాట్లాడుతూ చాలా మంది రక్తనాళాలు సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని ముందుగానే నిర్ధారణ చేసుకుంటే చికిత్స సులభం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో రోటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, హాస్పిటల్ మేనేజర్ అవినాష్, పిఆర్‌ఒలు చంద్ర శేఖర్, దుర్గా ప్రసాద్ రోటరీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాజు

మారిక గ్రామాన్ని అదానీకి అప్పగించొద్దు

సచివాలయంలో అభ్యంతర దరఖాస్తు ఇచ్చిన పోరాట నాయకులు

ప్రజాశక్తి- వేపాడ

మారిక గ్రామాన్ని అదానీకి అప్పగించొద్దని, గ్రామంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి పరిగణలోకి తీసుకోవాలని మంగళవారం సిపిఎం మండల నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యంలో జాకేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్‌ను కలిసి అభ్యంతర దరఖాస్తును అందించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ గుజరాత్‌కు చెందిన అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని, గిరిజన సంస్కృతిని జీవితాలను కాపాడాలని తెలియజేస్తున్నప్పటికీ అదానీకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనకకు తీసుకోకపోతే ప్రాణలు తీసుకోవడానికైనా గిరిజనులు వెనకాడబోరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయానికి విలువ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరకవలస సర్పంచ్ పాత బోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జాలరి వీర్రాజు, గెమ్మెల అప్పలనాయుడు, శ్రీను, కిల్లో అర్జున్, సిందేరి అసు, గెమ్మల బుజ్జిబాబు, పాతబోయిన దేవుడు, పాలి దేవుడు, శోభన్ బాబు, రమేష్, దేముడు, గెమ్మెల బింగు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి వినతినిస్తున్న నాయకులు

వైసిపి ఆర్‌టిఐ వింగ్ జిల్లా అధ్యక్షుడుగా సుబ్రమణ్యం

ప్రజాశక్తి - జామి

వైసిపి బలోపేతంలో భాగంగా 29 విభాగాలకు చెందిన కమిటీ అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం నియమించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) విభాగానికి జిల్లా అధ్యక్షులుగా చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యంను నియమించింది. అప్పాన సుబ్రమణ్యం 20 ఏళ్ళు పాటు జర్నలిస్టుగా పని చేసి ప్రస్తుతం చింతాడ సర్పంచ్‌గా ఉన్నారు. గతంలో అదే గ్రామానికి ఉప సర్పంచ్‌గా పని చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సర్పంచుల సంఘం ఎస్.కోట నియోజకవర్గం ప్రతినిధిగా పని చేశారు. ఇలా అనేక పదవులు చేసిన సుబ్రమణ్యం సర్పంచుగా చురుకైన పాత్ర పోసిస్తున్నారు. వైసిపి అధికారం పోయాక, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం విభాగానికి జిల్లా అధ్యక్షుడిగా సుబ్రమణ్యంను నియమించడం మంచి పరిణామం అని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయి. తనకు అప్పగించిన గురుతర బాధ్యతను చిత్త శుద్ధితో నిర్వర్తిస్తానని సుబ్రమణ్యం ఈ సందర్భంగా తెలిపారు. ఆయనకు స్నేహితులు, బంధువులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

అప్పాన సుబ్రమణ్యం

ప్రభుత్వ భూములను పంచాయతీకి అప్పగిస్తాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ పరిధిలో గల ఎస్‌విఎన్ స్వప్నలోక్ లేఅవుట్‌లో ప్రభుత్వ భూమి ఉంటే ఆ భూమిని పంచాయతీకి అప్పగిస్తామని ఎస్‌విఎన్ శ్రీనివాస సుజాత గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్వప్నలోక్ లేఅవుట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గత 40 ఏళ్లగా ఎటువంటి ఆరోపణలూ లేకుండా వ్యాపారాలలో ఎదుగుతూ వస్తున్న తమపై కొంతమంది ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తమ వ్యాపారాల వల్ల ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామే తప్ప ఎవరిని ఇబ్బందులు పెట్టలేదని ఈ లేఅవుట్‌లో అన్ని సక్రమంగా ఉన్నాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఎటువంటి అవకతవకలు జరగలేదని ధ్రువీకరించారని చెప్పారు. ఇక్కడ ఉన్న నాలుగు చెరువులలో ఏ ఒక్క చెరువుకు సంబంధించన అంగుళం భూమి కూడా తాము ఆక్రమించలేదని ఎటువంటి సందేహాలు ఉన్న సర్వే చేసి చూసుకోవచ్చునని ఆయన తెలిపారు. ముసిడిపల్లి మాజీ సర్పంచ్ కనకం మాట్లాడుతూ గ్రామ సభ ద్వారా పంచాయతీ అనుమతితోనే లేఅవుట్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టారని ఈ లేఅవుట్ వల్ల చుట్టుపక్కల వారికి ఉపాధి లభిస్తుందని అన్నారు ఈ సమావేశంలో ఈశ్వర్ కౌశిక్, ముషిడిపల్లి, చిన్నకండేపల్లి గ్రామ నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నా తండ్రిని కొట్టి చంపేశారు..

పోలీసులకు మృతుని కుమారుడు ఫిర్యాదు

ప్రజాశక్తి - జామి

మండలంలోని కుమారం గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ ఎద్దు సూర్యనారాయణ(47)ను ఎదురింటికి చెందిన వంకా రవి అనే వ్యక్తి కొట్టి చంపేశాడని సూర్యనారాయణ(47) కుమారుడు శ్రీనివాస్ మంగళవారం జామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్. కోట రూరల్ సి ఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఏఎస్ఐ నర్సింగ్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున సూర్యానారాయణ ఇంటి వద్ద గల రచ్చ బండపై కూర్చుని ఉండగా, అక్కడకు వచ్చిన వంకా రవి సూర్యనారాయణతో గొడవ పడి, దాడికి దిగాడు. బలమైన పిడి గుద్దులు గుద్దడంతో సూర్యానారాయణ తీవ్రంగా గాయ పడ్డాడు. గాయపడ్డ తన తండ్రికి సపర్యలు చేసి, వైద్యం కొసం తరలించే లోపే మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. వెంటనే నిందితుడు రవిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రవికి నేర చరిత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ

యాప్‌లో నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామస్థాయి మహిళ స్వయం శక్తి సంఘాల సమావేశాలకు జియో ఫేస్ రిజిస్ట్రేషన్ ఫెన్సింగ్ యాప్‌లో ముఖచిత్రం నమోదు తప్పనిసరి అని ఎపిఎం బాసిన గోవిందరావు అన్నారు. మంగళవారం ఆర్ అముదాలవలస, నాయిరాలవలస గ్రామాల్లో మహిళా సమైక్య సమావేశాలు నిర్వహించారు. ఈ గ్రామాల్లో స్వయం శక్తి సంఘాలు ప్రతినెలా సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యులంతా హాజరయ్యేందుకు వీలుగా ముఖ ఆధారిత నమోదు ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. గతంలో సమావేశాలు పెట్టకపోయినా నిర్వహించినట్లు దస్త్రాల్లో సంతకాలు చేస్తున్నారనే అపవాది ఉండేదని, బ్యాంకు రుణం తీసుకున్నప్పుడు మాత్రమే గ్రూప్ సభ్యులందరూ వచ్చేవారు ఎక్కడున్నా సంఘ సభ్యులు పొదుపు డబ్బులు పంపిస్తే చాలు అనే విధంగా ఉండేదని తెలిపారు. ఇప్పుడు అలా కాకుండా పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేసిందని అన్నారు. గ్రామంలో ప్రతి స్వయం శక్తి సంఘం సమావేశం నిర్వహించి సంఘం ఫోటోతో పాటు సభ్యురాలు ఫోటో యాప్‌లో విఒఎ ప్రతినిధి నిక్షిప్తంగా బాధ్యత వహించాలన్నారు. ప్రతినెల ఎక్కడ సమావేశం నిర్వహిస్తారో ఆ ప్రాంతాన్ని నమోదు చేయాలని వెల్లడించారు. మండలంలో 1813 గ్రూపులు ఉండగా సుమారు 19,436 మంది సభ్యులు ఉన్నారని, గ్రామాల్లోని సంఘాల సభ్యులను సమావేశపరిచి ముఖ గుర్తింపు, బుక్ కీపింగ్, చరవాణి నెంబర్ అనుసంధానం చేయాలన్నారు. ఈ సమావేశంలో విఒఎలు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సిలింగ్ హర్షనీయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ సంవత్సరం జరగాల్సిన ఉపాధ్యాయ బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ స్థానంలో ఉపాధ్యాయులు అందరూ కోరుకుంటున్న మాన్యువల్‌గా జరపించడానికి ప్రభుత్వం ఒప్పుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందుకూరి అశోక్ రాజు ఆధ్వర్యంలో ఎస్‌కోట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక మంగళవారం ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా మాన్యువల్ కౌన్సెలింగ్ సాధించడానికి కృషి చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో వెబ్ కౌన్సెలింగ్ స్థానే మాన్యువల్ కౌన్సెలింగ్, ఉన్నత పాఠశాలలో తరగతికి 49 రోల్ పెరిగితే అదనపు సెక్షన్, ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక సెక్షన్స్ వేరుగా నిర్వహణతో పాటు పలు విషయాల్లో ప్రభుత్వ సానుకూలంగా స్పందించిందని తెలిపారు. పిఆర్‌టి నాయకులు కర్రి మోహన్ రాజు, చుక్క మధుమోహన్, కె.బంగారునాయుడు, అల్లు సురేష్, పాల్గొన్నారు.

ఎండియు వ్యవస్థ రద్దుపై హర్షం

ప్రజాశక్తి- రామభద్రపురం

ఎండియు వ్యవస్థను రద్దు చేస్తూ పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు చిక్కాపు రామారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళ వారం స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచకాల్లో డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి ఎండిఎం వ్యవస్థను ప్రవేశపెట్టి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఇంటింటికి రేషన్ సరుకులు అందజేస్తారని ప్రవేశపెట్టిన ఈ పథకం ఆదిలోనే అబాసుపాలయ్యిందని ఎద్దేవా చేశారు. పౌరసరఫరాల శాఖా మంత్రికి తాము ఇచ్చిన వినతి పత్రం సత్ఫలితాలు ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యలకు సానుకూలంగా స్పందించి న్యాయం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, సంబధిత శాఖ మంత్రి మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి కంటోన్మెంట్

గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలైన ఘటన రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని దాసన్న పేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... దాసన్నపేట లో నివాసముంటున్న ముప్పాన మణి తన ఇంట్లో ఉప్మా తయారు చేస్తుండగా గ్యాస్ లీక్ అయ్యి మంటలు రేగాయి. ఈ ఘటనలో ఆమె కాలిపోయింది. వెంటనే 108 వాహనంలో జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

CHANGE OF NAME

I, undersigned **BODDULA ADILAKSHMI** (Old Name) W/o **BODDULA SANKARA RAO**, Main Road, Boddula Street, Dwarapudi Village & Post, Vizianagaram Mandal & Dist 535003, Andhara Pradesh State. Cell : 9492995553 Changing from my name **BODDULA ADILAKSHMI** (Old Name) to **BODDULA ADHILAKSHMI** (New Name) shall hence forth I am being called as **BODDULA ADHILAKSHMI** (New Name) W/o Boddula Sankara Rao for all Purposes.

FACOR ALLOYS LIMITED

Regd. Office : Shreeramnagar - 535 101, Garividi, Dist. Vizianagaram (A.P.) CIN: L27101AP2004PLC043252
WEBSITE : www.facoralloys.in PHONE : +91 8952 282029 FAX : +91 8952 282188 E-MAIL : facoralloys@falgroup.in

STATEMENT OF UNAUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31ST MARCH, 2025

(₹ in Lakhs)

SR. NO.	PARTICULARS	STANDALONE					CONSOLIDATED				
		Quarter Ended			Year Ended		Quarter Ended			Year Ended	
		31st March 2025	31st December 2024	31st March 2024	31st March 2025	31st March 2024	31st March 2025	31st December 2024	31st March 2024	31st March 2025	31st March 2024
		Audited	Unaudited	Audited	Audited	Audited	Audited	Unaudited	Audited	Audited	Audited
1	Total Income from operations	16.77	—	42.12	16.97	15,379.49	16.77	—	42.12	16.97	15,379.49
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(376.32)	(376.90)	(579.35)	(617.31)	(2,389.61)	(376.30)	(376.92)	(586.84)	(617.27)	(2,326.50)
3	Net Profit / (Loss) for the period (before Tax, after Exceptional and / or Extraordinary items)	94.28	(4,023.32)	(1,494.25)	(6,121.12)	(4,331.38)	94.30	(4,023.34)	(670.17)	(6,121.08)	(2,762.91)
4	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	70.50	(3,109.74)	(1,313.87)	(25,021.47)	(3,492.23)	70.52	(3,109.76)	(489.79)	(5,021.43)	(1,923.76)
5	Total Comprehensive Income for the period [comprising Profit/ (Loss) for the period (after tax) and Other	31.87	(3,124.28)	(1,383.05)	(5,103.70)	(3,550.36)	31.91	(3,124.30)	(554.55)	(5,103.64)	(2,773.13)
6	Equity Share Capital	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48
7	Other Equity (excluding Revaluation Reserve) #	—	—	—	—	—	—	—	—	—	—
8	Earnings per share (before extraordinary items)										
	(of ₹ 1/- each) (not annualised) :										
	(a) Basic	0.04	(0.59)	(0.67)	(2.57)	(1.79)	0.04	(1.59)	(0.25)	(2.57)	(1.02)
	(b) Diluted	0.04	(0.59)	(0.67)	(2.57)	(1.79)	0.04	(1.59)	(0.25)	(2.57)	(1.02)

Other Equity (excluding Revaluation Reserve) for the year ended 31st March, 2024 is ₹ 8,239.01 lakhs for standalone and ₹ 8,995.90 lakhs for consolidated result.

Notes:
1 The above is an extract of the detailed format of Quarterly and Year Ended Financial Results filed with the Stock Exchange under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulation, 2015. The full format of the Quarterly and Year Ended Financial Results are available on the website of Stock Exchange at www.bseindia.com and on the Company's website www.facoralloys.in.
2 Previous period figures are regrouped/rearranged wherever necessary to facilitate comparison.

Place : Nagpur
Date : 20th May, 2025

QR SCAN

For FACOR ALLOYS LIMITED,
ASHISH SANTOSH AGRAWAL
WHOLE-TIME DIRECTOR
DIN: 02148665

AAA